

ఆదిత్యలో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ఐటీ విభాగంలో ఎపి రాష్ట్ర నైపుణ్య అభివద్ధి శిక్షణా సంస్థ(ఎపిఎస్‌ఎస్‌డిసి) ఆధ్వర్యంలో 6 రోజులపాటు జరిగిన వర్క్‌షాపు సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 'ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్మెంట్' అనే అంశంపై నిర్వహించిన ఈ వర్క్‌షాపులో విద్యార్థులు వివిధ రకాల అప్లికేషన్స్‌ని ఆండ్రాయిడ్ ఉపయోగించి ఎలా అభివృద్ధి చేయాలి? అనే అంశాలపై వర్క్‌షాపులో నేర్చుకున్నారని తెలిపారు. ఎపిఎస్‌ఎస్‌డిసి ప్రతినిధి ఎస్.వరప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన ఈ వర్క్‌షాపులో డీన్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డాక్టర్ ఎం.వి.రాజేష్, కోర్డినేటర్ ఎం.రాజాబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనిపించని సిట్టింగ్‌లు

- అసంతృప్తిలో అధికార పక్షం నేతలు
- ప్రచారానికి దూరంగా ఉన్న వైనం
- బుజ్జగించినా మారని తీరు



కొండేటి చిట్టిబాబు
ఎంఎల్ఎ, పి.గన్నవరం



జ్యోతుల చంటిబాబు
ఎంఎల్ఎ, జగ్గంపేట



పెండెం దొరబాబు
ఎంఎల్ఎ, పిఠాపురం




పర్వత పూర్ణచంద్రప్రసాద్
ఎంఎల్ఎ, ప్రత్తిపాడు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పనితీరు సక్రమంగా లేకపోవడం, అవినీతి, ఆరోపణలు ఎదుర్కోవడం, విడతలవారీగా జరిపిన సర్వేల్లో సానుకూలత లేకపోవడం వంటి కారణాలతో వైసిపి అధిష్టానం కాకినాడ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో నలుగురు సిట్టింగ్ ఎంఎల్ఎలను పక్కన పెట్టింది. వారిని కాదని ఆయా స్థానాల్లో వేరొకరికి టిక్కెట్లను కేటాయించింది. దీంతో తీవ్ర అసంతృప్తిలో ఉన్న సిట్టింగ్ ఎంఎల్ఎలు ప్రస్తుతం ముఖం చాటేస్తున్నారు. మొక్కుబడిగా కొన్ని కార్యక్రమాల్లో మాత్రమే పాల్గొంటున్నా ఎన్నికల ప్రచారంలో మాత్రం కనిపించడం లేదు.

జగ్గంపేటలో సిట్టింగ్ ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబుకు బదులు మాజీ మంత్రి తోట నరసింహంకు ఇక్కడ సీటుని కేటాయించారు. రెండు నెలల క్రితమే ఇన్‌ఛార్జ్‌గా ప్రకటించడంతో అప్పటినుంచి తీవ్ర అసంతృప్తితో ఉన్న చంటిబాబు నియోజకవర్గంలో అంతగా కనిపించడం లేదు. కొన్ని శంకుస్థాపనలు, ప్రారంభ కార్యక్రమాలు ఇటీవల జరగ్గా వాటికే పరిమితం అయ్యారు. అధికార పార్టీకి దాదాపుగా దూరంగానే ఉంటున్నారు. అధిష్టానం కూడా చంటిబాబుని పిలిపించి మాట్లాడలేదు. దీంతో ఆయన మరింత గుర్రుగా ఉన్నారు. పవన్ కళ్యాణ్ కాకినాడ వచ్చినప్పుడు రహస్యంగా ఆయనతో భేటీ అయ్యారు. జనసేనలోకి చేరి ఆ పార్టీ నుంచి పోటీ చేస్తారనే ప్రచారం కూడా అప్పట్లో జరిగింది. ఆ తర్వాత రాజకీయ పరిణామాలు ఏవి కనిపించలేదు. దీంతో వైసిపి చంటిబాబుని కనీసంగానైనా పట్టించుకోలేదు. మరోవైపు తోట నరసింహం, అతని కుటుంబం ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. చంటిబాబును కలుపుకుని వెళ్లేందుకు ఇష్టపడడం లేదు. ఆయన కేడర్‌ను కూడా పట్టించుకోవడం లేదు. దీంతో కొంతమంది టిడిపిలోకి చేరిపోయారు. ఇద్దరి ముఖ్య నేతల మధ్య తీవ్ర విభేదాలు ఉండడంతో వర్గాలుగా విడి పోయారు. ఈ నేప థ్యంలోనే చంటిబాబు కూడా తోట వెంట ప్రచారానికి వచ్చే అవకాశం కూడా కనిపించడం లేదు. దీంతో సిట్టింగ్ ఎంఎల్ఎ పరోక్షంగా సమీప బంధువైన జ్యోతుల నెహ్రూకి మద్దతు పలుకుతున్నారని ప్రచారం జరుగుతుంది. ఎన్నికలు



దగ్గర పడిన తర్వాత ఆయనే స్వయంగా నెహ్రూ తరపున ప్రచారం చేసే అవకాశం కూడా ఉందని ఆయన అనుచరులు చర్చించుకుంటున్నారు. ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌ను పక్కనపెట్టి వరుపుల సుబ్బారావును వైసిపి బరిలో దింపింది. దీంతో పర్వత ప్రసాద్ ప్రస్తుతం ఎటువైపు అనేది ఎవరికీ అర్థం కావడం లేదు. తీవ్రస్థాయిలో మైనింగ్ అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలతో ప్రసాద్‌కు టిక్కెట్ ఇవ్వలేదు. సొంత పార్టీలోనే ముఖ్య నాయకుల్ని, కార్యకర్తలను పక్కనపెట్టి తానే అంతా అన్నట్లుగా ప్రసాద్ వ్యవహరించడంతోనే ఎన్నికల్లో ఆయనకు పోటీ చేసే అవకాశం లేకుండా పోయిందని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని పార్టీలోని పలువురు నాయకులను డమ్మీలుగా మార్చేశారనే విమర్శలు కూడా ఆయనపై ఉన్నాయి. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారాన్ని వరుపుల సుబ్బారావు ముమ్మరం చేశారు. చివర వరకు తనకే టికెట్ దక్కుతుందనే ఆశతో ఉన్నానని ప్రసాద్ ఇప్పటికీ చెప్పుకుంటున్నారు. సుబ్బారావు ఎన్నికల ప్రచారానికి ఎంఎల్ఎను కనీసంగానైనా పిలవడం లేదు. ఇక పిలిచే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ప్రసాద్ స్వగ్రామమైన శంఖవరం మండలంలో ఎంపిపి పర్వత బాపనమ్మ, రాజబాబు సహకారంతో ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు సైతం అసంతృప్తిలో కొనసాగుతున్నారు. టిక్కెట్ దక్కకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు. ఆయన అనుచరులు కొంతమంది జనసేనలో చేరిపోయారు. ఎక్కువమంది కార్యకర్తలు బరిలో నిలిచిన కాకినాడ ఎంపీ వంగా గీతకు మద్దతు తెలుపుతూ ఆమె వెంటే ఉన్నారు. కేవలం కొన్ని శంకుస్థాపన కార్యక్రమాలకే పరిమితమైన దొరబాబును ఇటీవల అధిష్టానం పిలిపించి మాట్లాడింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రత్యర్థిగా పోటీలో ఉండడంతో అన్ని శక్తులను అధిష్టానం ఏకం చేసే పనిలో భాగంగానే దొరబాబుని కూర్చోబెట్టి మాట్లాడింది. ఎన్నికల అనంతరం ఎంఎల్‌సి పదవి ఇచ్చేలా సీఎం జగన్ నుంచి హామీ వచ్చినట్లు ఎంఎల్ఎ చెపుతున్నారు. దాంతో ఆయన రెండు రోజుల నుంచి ఎంపీ వంగా గీతతో ప్రచారంలో పాల్గొంటున్నారు.

పి.గన్నవరంలో సిట్టింగ్ ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు స్థానంలో జడ్‌పి చైర్మన్ వి.వేణుగోపాలరావుకి టికెట్ కేటాయించారు. కనీసం గానైనా ప్రచారానికి పిలవడం లేదు. ఆయనపై ఉన్న విమర్శలు కారణంగా ఓట్లు పడవని భావనలో వేణుగోపాలరావు ఉన్నారు. సంతృప్తితో ఉన్న చిట్టిబాబు కూడా వేణుగోపాలరావు వెంట తిరగడం లేదు. దీంతో చిట్టిబాబు వర్గం ఇతర పార్టీల్లోకి చేరిపోతున్నారు.

సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ



ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఎటువంటి అనుమతులు కావాలన్నా సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి అవసరమయ్యే అనుమతుల మంజూరుకు సువిధ యాప్ లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారికి లేదా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాహనాల అనుమతికి సంబంధించి దరఖాస్తు తోపాటు వాహన రిజిస్ట్రేషన్ వివరాలు, డ్రైవింగ్ లైసెన్సు, వాహన యజమాని పేరు, డ్రైవర్ పేరు, చిరునామా, మొబైల్ నంబరు తదితర వివరాలు జత చేయాలని తెలిపారు. వాహనం సంచరించే ప్రదేశాల వివరాలు, రూట్ మ్యాప్ తెలియ జేయాలన్నారు. మోటారు వాహన తనిఖీ అధికారి నుంచి వాహనాన్ని తనిఖీ సర్టిఫికేట్ పొందాలన్నారు. ర్యాలీలు, రోడ్ షోలు వంటి కార్యక్రమాలు అనుమతికి ప్రదేశం, రూట్ మ్యాప్, ర్యాలీలో పాల్గొనే వారి సంఖ్య, తేదీ, సమయం తదితర వివరాలను సంబంధిత రిటర్నింగ్ అధికారికి తెలియజేసి అనుమతి పొందాలన్నారు. అనుమతుల కొరకు అభ్యర్థులకు సమయాన్ని ఆదా చేసి సరైన సమాచారాన్ని సువిధా యాప్ అందిస్తుందన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత జవాబుదారీ తనాన్ని ప్రోత్సహించడంలో సహాయ పడుతుందన్నారు. సువిధా యాప్ కోసం పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో సువిధా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. సువిధా పోర్టల్‌లో నేరుగా దరఖాస్తు చేసుకున్న వాటిని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు సాధ్యమైనంత తొందరగా సహేతుకమైన విధానంలో అనుమతులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. అనుమతుల కొరకు నిర్దేశిత దరఖాస్తు ఫారంలో నింపి సమర్పించాలన్నారు. సువిధ యాప్ ద్వారా 19 రకాల అనుమతులు జారీ చేస్తామన్నారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా పారదర్శకంగా జరిగేలా చూడడానికి ఈ యాప్ విలువైన సాధనమన్నారు. ఇంటింటి ప్రచారానికి కూడా అనుమతి ఉండాలని స్పష్టం చేశారు. ఇళ్లలో బ్యానర్లు, స్టిక్కర్లు అంటించాలంటే ఆ ఇంటి యజమాని నుంచి అనుమతి ఉండాలని తెలిపారు. తాత్కాలిక ఎన్నికల కార్యాలయం ఏర్పాట్లకు అనుమతి కోసం భవన యజమాని అనుమతి లేదా అద్దె వివరాలు, ఇతర అంచనా వ్యయం తదితర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి అనుమతి కోసమైనా కనీసం 48 గంటల ముందుగా దరఖాస్తు చేయాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించినా, వాహనాలను ప్రచారానికి వినియోగించినా తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

ముద్రగడను కలిసిన ఎంపీ అభ్యర్థి సునీల్

ప్రజాశక్తి - కిర్లంపూడి

కాకినాడ వైసిపి ఎంపి అభ్యర్థి చలమలశెట్టి సునీల్ కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంను కిర్లంపూడిలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ముద్రగడ ఆశీస్సులు తీసుకోవడానికి వచ్చానని, కాకినాడ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముద్రగడ మద్దతుతో వైసిపి అఖండ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అలాగే గొల్లప్రోలు, తణుకు మండలాలకు చెందిన పలువురు అభిమానులు ముద్రగడను కలిసి మద్దతు తెలిపారు.



ముద్రగడ మర్యాదపూర్వకంగా కలిసిన సునీల్



సర్టిఫికెట్లు తీసుకున్న విద్యార్థులలో అరబిందో, కాకినాడ సెజ్ ప్రతినిధులు

శిక్షణ పూర్తియైన వారికి సర్టిఫికెట్ల అందజేత

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందచేశారు. సోమవారం మండలంలోని కొత్తమూలపేటలోని అరబిందో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాకినాడ సెజ్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, మహిళల సాధికారతకు ప్రాధాన్యం కల్పిస్తూ అరబిందో ఫార్మా ఫౌండేషన్ కాకినాడ సెజ్ పరిధిలో రెండు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ యువత నగర యువతతో సమానంగా పోటీ పడి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లోనూ ఈ సర్టిఫికెట్ల ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉందన్నారు. ఆ దిశగా యువత, మహిళలకు శిక్షణ ఇస్తున్న ప్రతిభ కేంద్రం కృషి అభినందనీయమని తెలిపారు. అనంతరం ప్రతిభ కేంద్రాల్లో శిక్షణ పూర్తి చేసుకునన 77 మంది యువకులకు సెజ్ అధికారులు మంతా శ్రీనివాస్, వీరారెడ్డి, కాకినాడ లైఫియస్ ఫార్మా మేనేజర్ ఎ.శ్రీనివాస్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

30న పెద్దాపురంలో రన్ ఫర్ జీసస్

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈనెల 30న పెద్దాపురంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని కో-ఆర్డినేటర్ డాక్టర్ లంక పురుషోత్తమ దాస్ తెలిపారు. సోమవారం నేతుల మెమోరియల్ లూథరన్ చర్చిలో కార్యక్రమానికి సంబంధించిన టి షర్ట్స్, క్యాప్‌లు, జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30వ తేదీ ఉదయం 6 గంటలకు .జరిగే రన్ ఫర్ జీసెస్ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిబిఐ సుకుమార్, జె.జోసెఫ్‌కుమార్, ఎన్.ఇమ్మానియేల్ సహాయం, జి.చందుస్టీఫెన్, పి.చిన్ని పాల్గొన్నారు.

నావికాదళ విన్యాసాల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మండలంలోని సూర్యారావుపేట పాత ఎన్‌టిఆర్ బీచ్, నేవల్ ఎంక్లేవ్ ఏరియాలో నేవీ ఆర్మీ సంయుక్త ఎక్సర్‌సైజ్ టైగర్ ట్రంప్ జరగనున్నాయి. భారత, అమెరికా సంయుక్త రాష్ట్రాల నావికాదళాల సంయుక్త విన్యాసాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి ఎన్.సతీష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకూ నావికాదళాల సంయుక్త దళాల విన్యాసాలు జరుగుతున్నాయి తెలిపారు. భారత నావికాదళం, అమెరికా సంయుక్త రాష్ట్రాల నావిక దళాలకు రక్షణ కోసం తగు సూచనలు చేయడం జరిగిందని చెప్పారు. సోమవారం నుంచి ఉప్పాడ సెంటర్ నుంచి లైట్ హౌస్ వైపు బీచ్ రోడ్డులో 29వ తేదీ వరకు వాహనాలకు అనుమతి లేదన్నారు. ట్రాఫిక్‌ను అచ్చంపేట జంక్షన్ మీదుగా పిఠాపురం వైపు మళ్ళించడం జరిగిందని అన్నారు. ప్రజలు ఈ ట్రాఫిక్ మళ్లింపును గమనించి పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.



ఆర్మీ అధికారితో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎస్‌పి సతీష్‌కుమార్

సత్యనారాయణ స్వామిని దర్శించుకున్న వరుపుల

ప్రజాశక్తి - అన్నవరం

వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరపుల సుబ్బారావు అన్నవరం సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఆయన పెళ్లి రోజును పురస్కరించుకుని సతీసమేతంగా సోమవారం సత్యదేవుడిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైసిపి మరోసారి అధికారాన్ని చేపడుతుందని అన్నారు. సిఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలే వైసిపిని గెలిపిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి శ్రేణులు ఆయనను స్థానిక వైసిపి నాయకులు కొండపల్లి అప్పారావు, మెరపల బాబురావు, దడాల సతీష్, బలువు రాంబాబు తాటిపాక కృష్ణ, ఆర్లి సూరిబాబు కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందించి వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



సత్యదేవుడిని దర్శించుకున్న వరుపుల సుబ్బారావు దంపతులు

కోలాహలంగా ఎన్నికల ప్రచారం

జిల్లాలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని కోలాహలంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు హామీలు ఇస్తూ రాబోయే ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ నగరంలోని 9వ డివిజన్లో దుర్గమ్మ గుడిలో మాజీ ఎమ్మెల్యే కొండబాబు, బిజెపి నాయకులు పైడా భవాన ప్రసాద్, జనసేన నాయకులు సత్యనారాయణ నాయకులు కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం డివిజన్లో పర్యటించి టిడిపి కూటమి అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు మల్లిపూడు వీరు, వాసంశెట్టి చిట్టప్ప, లూటుకుర్తి మోహన్, తంగెళ్ల వివి.సత్యనారాయణ, గీసాల పని, చోడిశెట్టి రమేష్, పాల్గొన్నారు. **గండేపల్లి** టిడిపి జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ సోమవారం తాళ్లూరు, నీలాద్రిరావుపేట, జడ్.రాగంపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతుల మోహన్‌రావు, శీలామంతుల వీరబాబు, పయిణ్ణి వెంకటేశ్వరరావు, కందుల చిట్టిబాబు పాల్గొన్నారు. అలాగే వైసిపి జగ్గంపేట నియోజకవర్గ అభ్యర్థి తోట నరసింహం సతీమణి తోట వాణి, కోడలు శ్రీనిధి మండలంలోని పి.నాయకంపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాబోయే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లిరెడ్డి పాపారావు, ఎంపిపి చలగళ్ల దొరబాబు, రామకుర్తి మూర్తి, మద్దిపట్ల రామకృష్ణ పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలంలోని కట్టమూరు గ్రామానికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. వారికి ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప టిడిపి కండువాలు కప్పి ఆహ్వానించారు. కేశవ పట్టాభిరామ స్వామి దేవాలయ ధర్మకర్తలు, రాజమండ్రి శివ, సానిపిని మాణిక్యం, ఎస్‌సి సంఘం అధ్యక్షులు ముప్పిటి గంగాధర్, ఒకటో వార్డు సభ్యులు సరపగోలు దుర్గల ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు, కందుల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.**సామర్లకోట** స్థానిక 27 వార్డులో టిడిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే బాబు, బలుసు వాసు పాల్గొన్నారు. అలాగే 5వ వార్డుకు చెందిన పలువురు వైసిపిలో చేరారు. వీరికి వైసిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు సుబ్బారావు, నెక్కంటి సాయిప్రసాద్, దూది రాజబాబు పాల్గొన్నారు.


కౌంటింగ్ సెంటర్‌ను సందర్శించిన ఆర్ఓ

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సోమవారం జెఎన్‌టియుకె ఆవరణలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ లను సందర్శించారు. అవసరమైన సదుపాయాలపై ఆయన ఆరా తీశారు. విధి నిర్వహణలో ఉండే సిబ్బందికి, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలలో ఎటువంటి అసౌకర్యం లేకుండా అవసరమైన అన్ని సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎఆర్ఓ దొర, ఎలక్షన్ డిటి సీతాపతిరావు, ఎఇ రమేష్, సర్వేయర్ ఆచార్యులు, శానిటరీ సూపర్‌వైజర్ జిలాని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.



తణుకు నియోజకవర్గ నేతలతో మాట్లాడుతున్న ముద్రగడ



క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - గండేపల్లి

క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగు తుందని కోర్పు లచ్చయ్యదొర అన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఐదు రోజులపాటు మందకొండ మాలక్ష్మి అమ్మవారి జాతర అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు రోజులపాటు బాబు రాజేంద్రప్రసాద్ జిల్లా స్థాయి వాలీ బాల్ టోర్నమెంట్‌ను పెద్ది బాబూరావు జ్ఞాపకార్థం నిర్వహించారు. ఈ టోర్నమెం టులో 24 జట్లు పాల్గొన్నాయి. రాజానగరం జట్టు విన్నర్‌గా కాగా, కానవరం జట్టు రన్నర్ జట్టుగా నిలిచింది. మూడో స్థానంలో నరేంద్రపురం జట్టు నిలిచింది. ఈ సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రధానం కార్యక్రమం జరిగింది. విన్నర్ జట్టుకు రూ.20 వేలు, రన్నర్ జట్టుకు రూ.15 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.9 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.6 వేలు చొప్పున నగదు బహు మతులను అందించారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర మాట్లాడుతూ తమ తండ్రి పెద్ది బాబూరావు జ్ఞాపకార్థం ఆయన కుమార్తెలు జోగేశ్వరి, రాధికలు టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కామినేని జయశ్రీ, కోర్పు దుర్గాప్రసాద్, జోగేశ్వరి, రాధిక అభినందించారు. ఈ కార్యక్రమంలో పిడిలు ఎస్.నాగరాజు, శ్రీనివాస్, ప్రసాద్, ఆనంద్, రెడ్డియ్య, వెంకటేశ్వరరావు, సుబ్బరాజు పాల్గొన్నారు.



విజేత జట్టుకు కప్‌ను అందిస్తున్న కోర్పు లచ్చయ్యదొర, ఇతరులు

డ్రగ్స్ వ్యవహారంపై సిఎం స్పందించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

రాష్ట్రంలో డ్రగ్స్ వ్యవహారంపై సిఎం జగన్ సమాధానం చెప్పాలని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దూళిపూడి వెంకటరమణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర యువతకు ఉపాధి లేకుండా రాష్ట్రాన్ని గంజాయి వనంగా మార్చేశారని దుయ్యబట్టారు. గత వారం రోజులుగా విశాఖ కేంద్రంగా జరుగుతున్న డ్రగ్స్ వ్యవహారంపై సిఎం నేటికీ మాట్లాడకపోవడం దారుణమన్నారు. తక్షణమే సిఎం స్పందించాలని డిమాండ్ చేశారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విజయవాడ నుంచి మంగళగిరికి వెళ్లే క్రమంలో ప్రతినిత్యం తనిఖీలు చేయడం ఎంతమాత్రం సహేతుకంగా లేదన్నారు. ఈ సమావేశంలో తెలుగు యువత నాయకులు అనుకూలి శ్రీనివాసరావు, వాడ్రేవు ప్రవీణ్, కుడుపూడి దుర్గాప్రసాద్, కాండ్రేకుల శ్రీనివాస్, దున్న శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా హోలీ పండుగ

ప్రజాశక్తి - తాళ్లరేవు, పెద్దాపురం

మండలంలో పలుచోట్ల హోలీ పండుగను ఉత్సాహంగా జరుపు కున్నారు. ఈ సందర్భంగా స్నేహితులు ఒకరిపై ఒకరు రంగులు జల్లుకున్నారు. అలాగే మండలంలోని పులిమేరులో శాంతి వర్ధన వికలాంగుల పాఠశాలలో సోమవారం హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రంగులు, రంగుల నీటిని చల్లుకుంటూ విద్యార్థులు ఆనందంగా గడిపారు.



పెద్దాపురం శాంతివర్ధనలో హోలీ సందడి

నేరాలు ఘోరాలు

పేకాడుతున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం మార్కండేపాడు గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. ఎస్ఐ పి.నాగరాజు తెలిపిన వివరాల మేరకు... తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఆదివారం అర్ధరాత్రి పేకాట శిబిరంపై దాడి చేశామన్నారు. ఈ దాడిలో నలుగురు జూదరులను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.14వేల నగదు, ఒక కారు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.



మండపేటలో పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

సారా, సామగ్రి స్వాధీనం

ప్రజాశక్తి-మండపేట, ఆత్రేయపురం

మండలంలోని వెలగతోడు కాలవ గట్టున సారా తయారు చేసే బట్టీపై దాడి చేసి 60 లీటర్ల నాటు సారా, గ్యాస్ సిలిండర్, సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ చైతన్య కుమార్ అన్నారు. పలువురు ఇచ్చిన సమాచారం మేరకు ఆయన తన సిబ్బంది నక్కా నారాయణమూర్తి, పిల్లి సత్యకుమార్, డి.రవి కిషోర్, చంద్రన్‌తో దాడి చేసి వీటిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తయారీదారుడైన పాలతోడు గ్రామానికి చెందిన గుత్తుల శ్రీహరిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఆత్రేయపురం మండలంలోని గ్రామాల్లో గోదావరి పరీవాహక ప్రాంతాలలో విస్తత దాడులు నిర్వహించారు. పేరవరం గ్రామ శివారున కోమలి నాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని అతను వద్ద నుండి 15 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాసు తెలిపారు.

ఏలేరు కాలువలో జారిపడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని చదలాడ గ్రామానికి చెందిన తాడాల సూర్యనారాయణ (70) ఏలేరు కాలువలో జారిపడి మృతి చెందాడు. గత రెండు రోజులుగా సూర్యనారాయణ కన్పించకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు,స్నేహితుల ఇళ్లకు వెళ్లి వెతికారు. ఈ నేపథ్యంలో సోమవారం ఏలేరు కాలువలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వి.సురేష్ సంఘటన ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని సూర్యనారాయణదిగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

సోమవారం రఘుదేవపురం గ్రామం పరిధి రవింద్ర కాలనీలో అక్రమ మద్యం నిల్వలు ఉన్నాయని సమాచారం అందటంతో సీతానగరం ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో రవింద్ర కాలనీకి చెందిన పిసిని కిషోర్ అనే వ్యక్తి వద్ద నుండి 12 మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు పద్దెనిమిది వందల ఇరవై రూపాయలు ఉంటుందని, కేసు నమోదు చేసి, స్టేషన్ బెయిల్ ఇచ్చి నిందుతుడిని విడిచి పెట్టినట్లు ఎస్ఐ రామకష్ణ తెలిపారు.



ప్రకాశరావును సత్కరిస్తున్న గంటి హరీష్ మాధుర్

టిడిపిలో కార్యకర్తలకు తగిన గుర్తింపు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

నిబద్ధతతో పని చేసే కార్యకర్తలను గుర్తించడంలో తెలుగుదేశం పార్టీ ముందుంటుందని టిడిపి అమలాపురం పార్లమెంటరీ ఉమ్మడి అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక టిటిఆర్ నగర్‌లోని తాడి నరసింహారావు గృహంలో సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు అర్థాని శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో హరీష్ మాధుర్ మాట్లాడారు. పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శిగా నియమితులైన సిహెచ్ గున్నేపల్లి ఉప సర్పంచ్ యాళ్ల సూర్య ప్రకాశరావును మాధుర్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధతతో పని చేసే కార్యకర్తలను గుర్తించి గౌరవించడం టిడిపికే సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, దొమ్మేటి రమణ కుమార్, చిక్కాల అంజిబాబు, పిల్లి నాగరాజు, గోనెమడతల రాజా పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయిని విమల కుమారి మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక లూథరన్ హైస్కూల్ విశ్రాంత ఉపాధ్యాయిని వి.రత్నకుమారి(66) సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె హిందీ ఉపాధ్యాయినిగా విద్యార్థులకు ఎన్నో సేవలు అందించారు. ఆమెకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆమె మృతికి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

యానాం వార్తలు



నామినేషన్ దాఖలు చేస్తున్న నమశివాయం

నామినేషన్ దాఖలు చేసిన నమఃశ్శివాయ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానానికి ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి ఎ.నమశ్శివాయం సోమవారం పుదుచ్చేరిలో తన నామినేషన్ దాఖలు చేశారు. నమశ్శివాయం పుదుచ్చేరి ఎన్ఆర్ కాంగ్రెస్, బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. పుదుచ్చేరిలో ఏప్రిల్ 19న తొలివిడతలో పోలింగ్ జరగనుంది. నామినేషన్ దాఖలు చేసిన నమశ్శివాయం వెంట పుదుచ్చేరి సిఎం ఎన్.రంగస్వామి, రాజ్యసభ సభ్యుడు సెల్వ గణపతి, నిర్మల్ కుమార్ సురానా పాల్గొన్నారు.



శివ దంపతులను సత్కరిస్తున్న పరిపాలనాధికారి మునిస్వామి

'పెసల' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - యానాం

పరిపాలనాధికారి కార్యాలయంలో సూపర్‌టెండెంట్‌గా పెసల ఓం నమశ్శివాయ(శివ) అందించిన సేవలు అభినందనీయమని పరిపాలనాధికారి మునిస్వామి అన్నారు. స్థానిక సూపరింటెండెంట్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పెసల శివ పదవి విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 35 సంవత్సరాలపాటు వివిధ ప్రభుత్వ శాఖలలో శివ అందించిన సేవలు అభినందనీయమని అన్నారు. అనంతరం పెసల ఓం నమశ్శివాయ, సతీమణి పద్మావతి దంపతులను మునిస్వామి సత్కరించారు.అనంతరం యానాంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

ఘనంగా శ్రీవేద పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - యానాం

శ్రీవేద పబ్లిక్ స్కూల్ రెండో వార్షికోత్సవం సోమవారం సాయంత్రం స్కూల్ చైర్మన్ గుత్తుల గోవింద జయరామరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కృష్ణ వినాయకరావు కాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవంలో ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, ప్రాంతీయ విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణప్రవీణ్, ఎడిపిసి కమిడి ప్రభాకర్‌రావు, విశ్రాంత ఉద్యోగి చీకట్ల సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్‌లు అర్జున్, నీతూ హరి, ప్రిన్సిపల్ అనుపమ, నక్కా వాసుదేవరావు, సిహెచ్.రామకృష్ణ, సిహెచ్.అనుమంతరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులచే చేయించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు.



ఆలయం వద్ద అన్నదానంలో పాల్గొన్న ప్రజలు

గంగమ్మతల్లి విగ్రహ, శిఖర ప్రతిష్టాపన

ప్రజాశక్తి - యానాం

యానాం బైపాస్ రోడ్డులో బాలయోగి వారధి వద్ద నూతనంగా నిర్మించిన దొడ్డి గంగమ్మ తల్లి ఆలయంలో సోమవారం అమ్మవారి విగ్రహ, అలాగే ఆలయశిఖర ప్రతిష్ట కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. అల్లవరుపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని, అల్లవరపు కామేశ్వరశాస్త్రి అవధాని ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ప్రతిష్టా కార్యక్రమాలను శాస్త్రయుక్తంగా నిర్వహించారు. ఉత్సవదారులు కోన సూర్యనారాయణ, కోన వీరవెంకట రామచంద్రరావు, కోన సూరిబాబు దంపతులచే అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ఆలయశిఖర ప్రతిష్ట జరిపించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించగా యానాం పరిసరప్రాంతాల నుంచి ప్రజల పాల్గొన్నారు. కమిటీ ప్రతినిధులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆయా గ్రామాల ప్రజలు,భక్తులు, తదితరులు తరలి వచ్చారు.

లీగల్ సెల్ సెక్రెటరీగా అఖిలేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

వైసిపి పట్టణ వైసిపి లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీగా కొన వెంకట అఖిలేశ్వర్ రెడ్డిని ఎంపిక చేయడంపై పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ బళ్ల గేటు ప్రాంతానికి చెందిన అఖిలేశ్వర్ రెడ్డి పార్టీ అభివృద్ధికి చేస్తున్న సేవలను గుర్తించి పట్టణ లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీగా ఎంపిక చేస్తూ సోమవారం లేఖ అందిందన్నారు. తన ఎంపికకు కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొంతు సత్య శ్రీనివాస్ పెన్మత్స చిట్టి రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వతంత్ర అభ్యర్థిగా శ్యామ్ కుమార్..?

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

29 ఏళ్లుగా టిడిపిలో కొనసాగున్న పరమట శ్యామ్ కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్టు తెలుస్తోంది. 2004, 2009, 2014, 2019లో ఆయన టిడిపి అభ్యర్థిత్వం కోసం తీవ్రంగా ప్రయత్నించారు. మూడుసారి కూడా టికెట్ మాజీ ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావుకే కేటాయించడంతో శ్యామ్ కుమార్ నిరాశ చెందారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయరాలని ఆయన నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.

ప్రమాదకరంగా డ్రెయినేజీ బల్లలు

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ పరిధిలోని రాజారత్న జంక్షన్‌లోని డ్రైనేజీపై ఉన్న బల్లలు ప్రమాదకరంగా మారాయి. వాటిని రోడ్డు సమాంతరంగా పెట్టకపోవడంతో రోడ్డు కంటే ఎత్తుగా ఉండి ప్రమాదాలను తలపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకోక ముందే మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ బల్లలు

భవన నిర్మాణ కార్మికుల సంఘం ఎన్నిక

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సోమవారం ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ మొదటి మహాసభలు ముగిశాయి. ఈ సభకు మోహనరావు అధ్యక్షతన వహించగా సిఐటియు జిల్లా కార్యదర్శులు నూకల బలరామ్, దుర్గాప్రసాద్, నాయకులు భాస్కరరావు, జిల్లాలో వివిధ సంఘ నాయకులు మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ ఇవ్వాలని, ఇసుక ర్యాంప్‌లో మిషనరీతో కాక కార్మికులతో లోడింగ్ చేయించి కార్మికులకు పని కల్పించాలని వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న పార్టీలు భవన నిర్మాణ కార్మికుల పట్ల తమ వైఖరిని తెలియజేయాలని, తమ గురించి మేనిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భవన నిర్మాణ సంఘాలు జిల్లావ్యాప్తంగా ఏకమై తమ డిమాండ్లను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. నూతన జిల్లా కమిటీగా గౌరవాధ్యక్షునిగా పిండి కాళిదాస్, ప్రెసిడెంట్‌గా విప్పర్తి మోహన రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నల్లి ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్లుగా చవ్వాకుల నానిబాబు, అయితాబత్తుల శ్రీనివాసరావు, జనరల్ సెక్రెటరీగా నూకల బలరామ్, సెక్రటరీలుగా శ్రీను, కో ఆప్షన్, ట్రెజరీగా వేణు, సభ్యులుగా ఆర్.చిన్ని, డి.సుబ్బారావు, నక్కా రామారావు, విజయ్ కుమార్, జి.సత్తి బాబు, జె.చిన్నబాబు, పి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.



కమిటీని అభినందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

చదువుతో పాటు సంస్కారం అవసరం

ప్రజాశక్తి-గోకవరం

విద్యార్థులు చదువుతో పాటు లోకజ్ఞానం, సంస్కారం కూడా చాలా అవసరమని జ్ఞాన సరస్వతి విద్యా నికేతన్ చైర్మన్ కంచర్ల ప్రకాష్, ఫౌండర్, డైరెక్టర్ బొడ్డేటి సురేష్ అన్నారు. సోమవారం పాఠశాల ప్రాంగణంలో తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ కంచర్ల సూర్యప్రకాష్ మాట్లాడారు. పట్టణ ప్రాంతాలకే పరిమితమైన కార్పొరేట్ విద్యను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందించే లక్ష్యంతోనే ఈ విద్య సంస్థను నెలకొల్పామన్నారు. విద్య ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ పడకుండా సంస్థను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. బొడ్డేటి సురేష్ మాట్లాడుతూ తిరుమల విద్యాసంస్థలతో పాటు పలు విద్యాసంస్థల్లో తాను ప్రిన్సిపల్‌గా పని చేశానన్నారు. ఇక్కడ విద్యార్థులకు ఆ స్థాయి విద్యందించడమే తమ లక్ష్యమన్నారు.

భోగవల్లికి ఘన నివాళి

ప్రజాశక్తి - పెరవలి

తీపర్రుకు చెందిన సిపిఐ నాయకులు భోగవల్లి నరశింహమూర్తి (దత్తుడు)ని పలువురు ఘనంగా నివాళు లర్పించారు. తీపర్రులో దత్తుడు సంస్మరణ సభ సోమవారం నిర్వహించారు. పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు భీమారావు మాట్లాడారు. కమ్యూనిస్టు ఆశయసాధనే దత్తుడు ఎనలేని కృషి చేశారన్నారు. దేవాదాయ ధర్మాదాయ కౌలు రైతుల సమస్యలు పరిష్కారానికి, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి పోరాడారన్నారు. పెనుగొండ నియోజకవర్గంలో సిపిఐ అభ్యర్థి వంక సత్యనారాయణ గెలుపులో కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన మతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు భోగవల్లి వెంకటేశ్వరరావు, చంటిబాబు, నామన వెంకటేశ్వరరావు, పంతం నాగేశ్వరరావు, రెడ్డి రామకృష్ణ, కంఠమని వెంకటేశ్వరరావు, మద్దిపాటి జానకిరామయ్య, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై నేడు అవగాహన

ప్రజాశక్తి-రామచంద్రపురం

సార్వత్రిక ఎన్నికల నియమాలు, నిబంధనలపై మంగళశారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు ఎంపిడిఒ రామచంద్రమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి మండలంలో ఉన్న అన్నీ రాజకీయ పార్టీల ప్రతినిధులూ హాజరు కావాలని ఆయన కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సులో వివరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-మండపేట

ఏడిదలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన పలువురు కాలనీవాసులు సోమవారం టిడిపిలో చేరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అందుకూరి పుల్లాజి, పలివెల దానియేలు, కుర్మాన శ్యామ్‌బాబు, చిట్టూరి ప్రసాద్, వారా రాజు, అందుకూరి రవి, మేడిద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ సంబరాలు

ప్రజాశక్తి మండపేట

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో హోలీ పండుగ సోమవారం ఘనంగా జరుపుకున్నారు. రంగులతోనే కాక డిజె పాటలు, రెయిన్ డ్యాన్స్‌లతో సందడి చేశారు. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని రసాయన రంగులతో ఆడకుండా సేంద్రియ రంగులతో హోలీ జరుపుకుంటున్నారు. మండపేట పబ్లిక్ స్కూల్లో హోలీ సంబరాలు అంబరాన్ని అంటాయి. స్కూల్ డైరెక్టర్ వల్లూరి చిన్నారావు పండుగ ప్రాధాన్యతను వివరించారు.



మండపేట ఎంపిఎస్‌లో హోలీ సంబరాల్లో విద్యార్థులు

పొన్నాడ ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి-కాట్రేనికోన

వైసిపి ముమ్మిడివరం అభ్యర్థి, ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గెద్దనాపల్లి పంచాయతీ పరిధిలోని పోరపేట, బక్కివారిపేట, పల్లిపాలెం గ్రామాలలో, కొప్పిగుంట పరిధిలోని కొప్పిగుంట, రావులచెరువు, కొత్తకాలనీ, నడవపల్లి పంచాయతీ పరిధిలోని గండిగానిచెరువు ప్రాంతాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట జెడ్‌పిటిసి నేల కిషోర్, ఎంపిపి పాలెపు లక్ష్మీ ధర్మారావు, నల్లా నరసింహమూర్తి, సంసాని నాగేశ్వరరావు, నడింపల్లి సూరిబాబు, ఏడిది సుబ్బు, ఇసుకపట్ల శ్రీనుబాబు, ఓలేటి సతీష్, దాసరి కాసుబాబు, కొవ్వూరి బుల్లి రాజు, మురళి, సర్పంచులు గంటి వెంకట సుధాకర్, మల్లాడి వీర బాబ్జి, నాది అలివేణి సత్యనారాయణ పాల్గొన్నారు.

అన్నదాన భవనానికి రూ.లక్ష విరాళం


ప్రజాశక్తి - ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ శ్రీనివాస ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి సోమవారం ఆత్రేయపురం గ్రామానికి చెందిన సాగిరాజు సూర్య తేజ రూ.1 లక్షా 1,116 విరాళం అందించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ భూపతి రాజు కిషోర్ కుమార్‌కు ఈ మొత్తాన్ని అందజేశారు. వీరికి స్వామివారి దర్శనానంతరం తీర్థప్రసాదాలతో పాటు స్వామివారి చిత్రపటం అందజేశారు.

మద్దిపాటికి అసమ్మతి సెగ

ప్రజాశక్తి - దేవరపల్లి

టిడిపి గోపాలపురం నియోజకవర్గంలో గ్రూపు విభేదాలు తారాస్థాయికి చేరాయి. టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు గోపాలపురం సీటు మద్దిపాటి వెంకటరాజు కేటాయించగా టిడిపి అసమ్మతి వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చింది. చివరకు గోపాలపురం సీటు మద్దిపాటికి కేటాయించడంతో గ్రూపుల పోరు తీవ్ర స్థాయికి చేరి అసమ్మతి వర్గ నాయకులు కార్యకర్తలు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకునే స్థాయికి చేరింది. దీనిలోభాగంగానే సోమవారం దేవరపల్లిలో కాకర్ల కళ్యాణ మండపంలో మద్దిపాటి అసమ్మతి వర్గం అత్యవసర సమావేశం అయ్యింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మద్దిపాటి మొదటి నుంచి అసమ్మతికి చెందిన వారిని దూరంగా పెడుతూ తన అనుకూలురును ప్రోత్సహిస్తూ వచ్చారని అభిప్రాయపడ్డారు. పార్టీలోని రెండు గ్రూపులను సమన్వయం చేయకపోవడంపై వీరు అసహనం వ్యక్తం చేశారు. టిడిపికి కంచుకోటగా ఉన్న గోపాలపురం నియోజకవర్గంలో టిడిపి విజయానికి పనిచేయాలంటే ప్రస్తుత అభ్యర్థిని మార్పు చేయాలని లేకపోతే టిడిపికి కంచుకోటగా ఉన్న గోపాలపురం సీటును కోల్పోయే పరిస్థితి వస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ఇకనైనా అధిష్టానం మేల్కొని పరిస్థితిని చక్కదిద్దకపోతే టిడిపి కంచుకోట కలగానే మిగిలిపోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిడిపి మండల మాజీ అధ్యక్షులు కోయిలమూడి చినబాబు, సుంకర దుర్గారావు, టిడిపి సీనియర్ నాయకులు ఇమ్మని సూరిబాబు, నందిన బుల్లి రాజు, పట్టణ అధ్యక్షులు గద్దె సుబ్రమణ్యం, సొసైటీ మాజీ అధ్యక్షులు కరుటూరు శ్రీనివాస్, తంగిళ్ళ మునేశ్వరరావు, యాగంటి సాయిబాబు, ఓరుగంటి లక్ష్మీపతి రాజు, బొల్లిన శ్రీధర్, చింతపల్లి నాగమణి, పాముల భూదేవి, తదితరులు పాల్గొన్నారు.



మద్దిపాటికి వ్యతిరేకంగా సమావేశమైన నాయకులు

ఇంటింటికీ టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి మండలం దేవరపల్లి గ్రామంలో సోమవారం టిడిపి గోపాలపురం నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు ఆధ్వర్యంలో మన ఇంటికి మద్దిపాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మేరక వీధి వినాయకుడి గుడి వద్ద పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అడుగడుగునా మద్దిపాటి వెంకట రాజుకు టిడిపి శ్రేణులు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఆండ్రు అనిల్, పార్టీ నాయకులు గన్ని మని హరికృష్ణ, కొండపల్లి దొరయ్య, యాగంటి వెంకటేశ్వరరావు, జనసేన గ్రామ అధ్యక్షులు కంబాల సత్తిబాబు, ఉప్పులూరి రాంబాబు, పెనుమత్స సుబ్బరాజు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు

కొండలరావును కలిసిన గిడ్డి

ప్రజాశక్తి -మామిడికుదురు

నగరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొమ్ముల కొండలరావును జనసేన పార్టీ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కొండలరావు అనారోగ్యంతో ఇంటి విశ్రాంతి తీసుకుంటున్నారు. కొండలరావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలూ సత్యనారాయణను ఎంఎల్ఏగా గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శిరిగినీడి వెంకటేశ్వరరావు, జాలెం శ్రీనివాస రాజా, గాంధీ పాల్గొన్నారు.